సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



సర్కారు నిర్లక్ష్యం.. కూలుతున్న వృక్షం

అక్రమార్కులు వృక్షాలను కూల్చేసి తమిళనాడు, మహా రాష్ట్రాలకు అక్రమంగా తలించుకుపోతున్నారు. టీడీపీ నేతల అండ పుష్కలంగా ఉండడంతో రెచ్చిపోతున్నారు. -8లో



వైద్యుల నిర్లక్ష్యం.. పురిటి బిడ్డ మృతి

గర్భం దాల్చి ప్రసవానికి వస్తే.. వైద్య సిబ్బంది తోచిన విధంగా కాన్పు చేయడంతో పురిటి బిడ్డ మృతి చెందిన ఘటన మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.230
రెండోరకం	రూ.130	రూ.180



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	560	670
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 755.460 కిలోలు

న్యూస్‌రీల్

13 నుంచి తిరుపతిలో రెసిడెన్షియల్ శిక్షణ

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ కడపజిల్లా రైతు సాధికారత సంస్థ వారి ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఫర్ న్యాచురల్ ఫామింగ్(ఎన్ఎంఎన్ఎఫ్) పోగ్రాం ద్వారా బయో రీసోర్సు సెంటర్‌పై ఈ నెల 13వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రకృతి సేద్యం ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తిరుపతిలో రెసిడెన్సియల్ శిక్షణా కేంద్రంలో శిక్షణకు ఆసక్తి గలిగిన రైతులు 9849900965 నెంబర్‌కు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం



పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో రెండోశనివారం సీతారామలక్ష్మణ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. టీటీడీ అధికారులు తీసుకొచ్చిన నూతన పట్టు వస్త్రాలు, బంగారు ఆభరాణాలు, తులసి గజమాలలతో సుందరంగా అలంకరించారు. సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రెండో శనివారం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి: ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమంలో జిల్లాలోని రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారం ఉదయం దేశవ్యాప్తంగా వంద జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, ఎక్కువ భూమిని సాగులోకి తీసుకురావడం, పంటల రుణాలను రైతులకు చేరవేయడమే లక్ష్యంగా ఈ పథకం అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయం, పాడి పరిశ్రమ ఇతర అనుబంధ రంగాలు అభివృద్ధి చెందుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మజీద్ అహ్మద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి, పీడీ ఏపీఎంఐపీ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై, నాబార్డు అధికారి విజయ విహారం, ఎల్‌డీఎం ఆంజేయులు, జిల్లా సహకార శాఖ అధికారి గురు ప్రకాష్, మత్స్యశాఖ అధికారి సుశ్మిత, జిల్లా సాగునీటి శాఖ అధికారి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు!

- తాజాగా డ్రైవర్ అష్రఫ్ అరెస్ట్
- తహసీల్దార్ ఎదుట హాజరుపరిచిన పోలీసులు.. ఏడురోజుల రిమాండ్
- నకిలీమద్యం కేసులో ముఖ్య నిందితుల చుట్టూ తిరుగుతున్న కథ
- నిందితుల వాంగ్మూలాల్లో బయటపడుతున్న బంధం





మదనపల్లెలో తంబళ్లపల్లె తహసీల్దార్ ఎదుట అష్రఫ్‌ను హాజరుపరిచిన ఎక్సైజ్ పోలీసులు



మదనపల్లె: ములకలచెరువు నకిలీమద్యం తయారీ రాకెట్ వ్యవహారంలో ముఖ్య నిందితుల చుట్టూ కేసు తిరుగుతోంది. ఇందులో టీడీపీ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి వద్ద పనిచేసిన వారు కేసులో ముగ్గురు నిందితులుగా ఉండటం గమనార్హం. నకిలీ మద్యం తరలించే వాహనానికి డ్రైవర్‌గా పనిచేసిన ములకలచెరువు నల్లగుట్టకు చెందిన సయ్యద్ కలీం అష్రఫ్ (23)ను అరెస్ట్‌చేసిన ఎక్సైజ్‌పోలీసులు తంబళ్లపల్లె కోర్టుసెలవు కారణంగా శనివారం మదనపల్లెలోని తంబళ్లపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట హాజరుపరిచారు. కేసు, రిమాండ్ రిపోర్ట్ పరిశీలించిన ఆయన.. నిందితునికి ఏడురోజుల రిమాండ్ విధించగా మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

జనార్దనరావే చేయించాడు

2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అష్రఫ్ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి (ఏ–17 నిందితుడు) వద్ద ఆరునెలలు పనిచేశాడు. నల్లరంగు స్కార్పియో వాహనానికి డ్రైవర్‌గా పని చేశాడు. ఈ సమయంలోనే కేసులో ఏ–1 జనార్దనరావుతో పరిచయం ఏర్పడింది. తర్వాత డ్రైవర్‌గా తీసివేయడంతో ములకలచెరువు మార్కెట్ యార్డులో కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం మంత్రి గిరిధర్‌రెడ్డి (ఏ–18 నిందితుడు, జయచంద్రారెడ్డి బావమరిది)ని ఏదైనా పని చూపించమని కోరగా మద్యం దుకాణం లేదా క్వారీలో పని ఇప్పిస్తానని చెప్పాడు. తర్వాత జనార్దనరావును కలిసి పని కావాలని చెప్పగా రెండు–మూడురోజులకు ఒకసారి నల్లరంగు స్కార్పియో వాహనంలో బెల్టు షాపులకు నకిలీమద్యం సరఫరా చేయాలని, దీనికి రోజుకు రూ.800 కట్టారాజు (ఏ–2 నిందితుడు) ఇస్తాడని జనార్దనరావు తెలిపాడు. అంగీకరించిన అష్రఫ్ జనార్దనరావు చెప్పినట్టు తన బైక్‌ను జయచంద్రారెడ్డి ఇంటివద్ద ఉంచాక ఆయన ఇంటిలో పనిచేస్తున్న అన్బురాసు అలియాస్ బాబు (ఏ–19 నిందితుడు) వాహనం తాళాలు తెచ్చి ఇచ్చేవాడు. వాహనంలో రాక్‌స్టార్ మద్యం దుకాణం వద్దకు వెళ్లి నకిలీమద్యం తీసుకుని బెల్టుషాపులకు తరలించేవాడినని. ఈ విషయం జయచంద్రారెడ్డి,అన్బురాసుకు తెలుసని, నకిలీమద్యం సరఫరా మొత్తం తనతో జనార్దనరావు చేయించినట్టు వాంగ్మూలంలో అష్రఫ్ పేర్కొన్నాడు.

» రాజేష్ కీలకం

ఈ కేసులో జయచంద్రారెడ్డి పీఏ టి.రాజేష్‌ను కీలకమైన నిందితునిగా ఎక్సైజ్ పోలీసులు భావిస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన రాజేష్ పేరిట ఒక మద్యం దుకాణం, నకిలీ మద్యం తరలించిన వాహనం ఉన్నాయి. ఇవికాక కురబలకోట మండలంలో కోట్ల విలువైన భూములు ఇతని పేరిట రిజిస్ట్రేషన్ జరిగి ఉండటం వెలుగుచూసింది. ఇవికాక ఇతర విషయాలు వెలుగులోకి రావాలంటే రాజేష్ అరెస్ట్ కీలకమని చెబుతున్నారు. విచారణలో మరిన్ని వాస్తవాలు తెలుస్తాయని అంటున్నారు. ఈ కేసులో 23 మందిని నిందితులుగా పేర్కొన్న ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసిన అష్రఫ్‌తో కలిపి ఇప్పటిదాకా 14 మందిని అరెస్ట్ చేయగా మిగిలిన నిందితులు జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, అన్బురాసు, బాలాజీ, సుదర్శన్, రవి, శ్రీనివాసులురెడ్డి, చైతన్యబాబు అరెస్ట్ కావాల్సి ఉంది.

▶▶ ఆ ముగ్గురి చుట్టూ..

జనార్దనరావు, జయచంద్రారెడ్డి, ఆయన బామర్ది గిరిధర్‌రెడ్డి చుట్టూనే కేసు నడుస్తోంది. జయచంద్రారెడ్డి, జనార్దనరావులు మిత్రులు కావడం, ఇక్కడికి పని చేస్తున్న వాళ్లను వివిధ ప్రాంతాల నుంచి రప్పించడం, నకిలీమద్యం తయారీ, సరఫరాలో వీరిపాత్ర వెలుగులోకి వచ్చింది. ఇప్పటిదాకా అరెస్ట్ అయిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వీరి ప్రస్తావన ఉన్నట్టు తెలుస్తోంది. ఏ–2 కట్టా రాజు డైరీలో ఏ–1 జనార్దనరావుతో సహా పలువురికి ఎంతెంత నగదు ఇచ్చింది, ఎవరి ఖాతాలో ఎంత నగదు జమచేసింది వివరాలు అందులో గుర్తించారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఈ విషయాలను పేర్కొన్నారు. తెనాలికి చెందిన కొడాలి శ్రీనివాసరావు కూడా తనకు ములకలచెరువు నకిలీమద్యం తయారీ కోసం భవనం లీజును తన పేరిట తీసుకోవడానికి జనార్దనరావు చెప్పడవల్లే జరిగిందని కూడా వెల్లడైంది. నకిలీమద్యం తయారీ ప్లాంట్‌పై ఎక్సైజ్ పోలీసుల దాడి విషయం జనార్దనరావే వాట్సప్ కాల్ ద్వారా తనకు తెలియజేసి ములకలచెరువు వెళ్లొద్దని చెప్పిన విషయాన్ని శ్రీనివాసరావు వెల్లడించినట్టు ఎక్సైజ్ పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

వాళ్లను కస్టడికి ఇవ్వండి

నకిలీమద్యం కేసులోని నిందితులను కస్టడికి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టును ఆశ్రయించారు. ముఖ్యమైన సమాచారం, వివరాలను సేకరించాల్సి ఉందని, దీనిపై నిందితుల కస్టడీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ వేయగా సోమవారం కోర్టులో విచారణ జరగనుంది.

డిసెంబరు 23న అంతర్జాతీయ సదస్సు

అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి



అంతర్జాతీయ సదస్సు బ్రోచర్లు విడుదల చేస్తున్న చొప్పాగంగిరెడ్డి

రాజంపేట: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చ, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా డిసెంబరు 23వ తేదీ నుంచి 24వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి తెలిపారు. ఏయూ వీసీ చాంబర్‌లో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను శనివారం ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి పరిశోధనల్లో ఏయూ మరింత ముందంజలో నిలుస్తుందని, నేటి యుగం డేటా ఆధారంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఏయూ వీసీ డా.సాయిబాబారెడ్డి మాట్లాడుతూ డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాలు నేటి సాంకేతిక ప్రపంచానికి నడిపించే శక్తులుగా మారాయన్నారు. ఆధునిక సాంకేతిక రంగాలపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధనాపత్రాలను సమర్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎబిటిఎస్ వైస్ ఛ:ర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డా.నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ ఆడ్మిషన్స్ డా.జయరామిరెడ్డి, ప్రోగ్రాం చైర్ డా.చిన్నబాబు, కన్వీనర్ నాగరాజు, పబ్లికేషన్ చైర్స్ డా.పహీముద్దీన్, డా.వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

పల్లె వైద్యం.. పరిస్థితి దైన్యం

- 15వ రోజుకు చేరిన వైద్యుల సమ్మె..
- వైద్యం అందక గ్రామీణలకు అవస్థలు



చిన్నమండెం మండలం చాకిబండ పీహెచ్‌సీ భవనం

రాయచోటి: పల్లె వైద్యం కుంటుపడింది. సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీల వైద్యులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరుకుంది. జ్వరాలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం కరువైంది.ప్రభుత్వం సరైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు డెంటల్, స్కిన్, ఆర్థో, కంటి వైద్య నిపుణులను అక్కడక్కడా ఏర్పాటుచేసిన ఫలితాలు కనిపించలేదు. చాలామంది వైద్యులు సెలవులపై వెళ్లినట్లు సమాచారం. దీంతో ఆసుపత్రికి వచ్చిన వారు అక్కడున్న నర్సులు, సిబ్బంది అందిస్తున్న వైద్యంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. జిల్లాలో 30 మండలాల్లో 51 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు నర్సులతో పాటు మిగతా సిబ్బంది ఉంటారు. ఇప్పుడు వైద్యులు లేకపోవడంతో పేషెంట్స్‌ను చూసే బాధ్యత నర్సులపై పడింది. కొన్ని వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ నివేదిక ద్వారా మందులు ఇవ్వాలి. ఈ పనులను నర్సులు చేయలేరు. దీంతో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. డాక్టర్లు లేరని తెలుసుకున్న స్థానికులు వైద్యం కోసం పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. మరికొందరు సమీపంలోని ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

- వైద్యుల ఇన్ సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించాలి, కచ్చితమైన పని గంటలను నిర్దేశించాలని కోరుతూ వైద్యులు సమ్మె చేస్తున్నారు. అయితే ప్రభుత్వం సమ్మెను విఫలం చేయాలన్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా సర్వజన ఆస్పత్రి.. తదితర ప్రభుత్వ విభాగాల నుంచి కొంతమంది వైద్యులను పీహెచ్‌సీలకు పంపింది. అయితే స్థానిక వైద్యులు సమ్మెలో ఉన్న కారణంగా పల్లెవాసులకు వైద్య సేవలు అందడం గగనంగా మారింది. ప్రభుత్వ మొండి వైఖరి పట్ల గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించి సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి


వైద్యుల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. ఇకపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైమరీ ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న వైద్యుల మద్దతును కూడా కోరతాం. న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం.

–రమేష్ బాబు, జిల్లా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

సెగ్మెంట్.. సంపద!



- ప్రథమస్థానంలో పులివెందుల
- పదో స్థానంలో బద్వేలు..
- జగనన్న పాలనలో నియోజకవర్గాల అభివృద్ధి



రాజంపేట: ఉమ్మడి కడపలో జిల్లాలో ధనిక నియోజకవర్గాలను గుర్తించారు. డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ వెలువరించిన సమాచారం మేరకు పులివెందుల ప్రథమ, బద్వేలు పదోస్థానంలో ఉంది. నియోజకవర్గాల అభివృద్ధి, పాడిపంటలు, పరిశ్రమలు లాంటి వాటిని బేరీజు చేసుకొని ఏ నియోజకవర్గం ధనికమో తేల్చారు.

పులివెందుల

పులివెందుల నియోజకవర్గ సంపద రూ. 5573 కోట్లు. వ్యవసాయరంగంలో ప్రథమ స్థానంలో ఉంది. తుమ్మలపల్లె యురేనియం ప్రపంచంలో ఉన్న అతిపెద్ద యురేనియం మైన్స్‌లో ఒకటిగా భావిస్తారు.



బద్వేలు..

10వ స్థానంలో ఉన్న బద్వేలు నియోజకవర్గం సంపద రూ. 2746 కోట్లు. పాడిపరిశ్రమంలో జిల్లాలో రెండో స్థానంలో ఉంది. ఫిషింగ్ సెక్టారులో జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. మిగిలిన అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది.

ప్రొద్దుటూరు..

తొమ్మిదో స్థానంలో ఉన్న ప్రొద్దుటూరు నియోజకవర్గం సంపద రూ.2778 కోట్లుగా ఉంది. వ్యవసాయ, పరిశ్రమల సెక్టారులో వెనుకబడి ఉంది. బంగారు, టెక్స్‌టైల్స్ వ్యాపారంతో ఈ నియోజకవర్గం అభివృద్ధి చెందింది.

రైల్వేకోడూరు..

8 స్థానంలో ఉన్న రైల్వేకోడూరు నియోజకవర్గం సంపద రూ3292కోట్లుగా ఉంది. మంగంపేట బెరైటీస్, ఉద్యాన వనంతో అభివృద్ధి చెందింది. మిగిలిన రంగాల్లో అభివృద్ధి చెందాలి.

కమలాపురం..

7వ స్థానంలో ఉంది. ఈ నియోజకవర్గ సంపద 3358 కోట్లు ఉంది. చిన్నపాటి ఆటోమొబైల్, ఇండ్రస్టీగా అభివృద్ధి చెందింది.

మైదుకూరు.

6 వస్థానంలో ఉంది. ఈ నియోజకవర్గ సంపద రూ, 3430 కోట్లుగా ఉంది. వ్యవసాయరంగంలో రెండోస్థానంలో ఉంది, వేరుశనగ అధిక విస్తీర్ణంలో సాగవుతుంది.

రాజంపేట..

5వ స్థానంలో ఉన్న రాజంపేట నియోజకవర్గ సంపద 3629 కోట్లుగా ఉంది. లైమ్‌స్టోన్, క్వారీ ఎక్కువగా జరుగుతుంది. అప్పుడప్పుడు కరవు వల్ల రైతులు నష్టపోతున్నారు.

కడప..

4వ స్థానంలో ఉన్న కడప నియోజకవర్గ సంపద రూ. 3718 కోట్లు. మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి.

రాయచోటి..

3వ స్థానంలో ఉన్న రాయచోటి నియోజకవర్గ సంపద రూ. 4145 కోట్లు. ఈ ప్రాంతం రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగంలో అభివృద్ధి చెందింది.

జమ్మలమడుగు..

2 స్థానంలో ఉన్న జమ్మలమడుగు నియోజకవర్గం సంపద రూ.4906 కోట్లు, సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. పరిశ్రమల రంగంలో బాగా ఉంది.

జగన్నపాలనలో నియోజకవర్గాల అభివృద్ధి..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి పథంలో నడిచాయి.ఇప్పుడు కూటమి పాలనలో నియోజకవర్గాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదనే అపవాదును మూటకట్టుకుందని పరిశీలకులు భావిస్తున్నారు.

నియోజకవర్గం	సంపద (రూలలో)
పులివెందుల	5573
జమ్మలమడుగు	4906
రాయచోటి	4145
కడప	3718
రాజంపేట	3629
మైదుకూరు	3430
కమలాపురం	3358
రైల్వేకోడూరు	3292
ప్రొద్దుటూరు	2778
బద్వేలు	2746

టెట్.. టెన్షన్

- టీచర్లను కలవరపెడుతున్న సుప్రీంకోర్టు తీర్పు
- రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే పదోన్నతులు కరువే
- తీర్పుపై పునరాలోచించాలంటున్న ఉపాధ్యాయులు




రాజంపేట టౌన్: పిల్లలకు పాఠాలు బోధించి పరీక్షలు నిర్వహించే గురువులకే ఇప్పుడు పరీక్ష పాస్ కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులంతా తాజాగా టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) రాయాల్సిందేనని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పైగా రెండేళ్లలోపు పాస్ కావాల్సిందేనని నిబంధనతో గురువులు ఆందోళన చెందుతున్నారు. సీనియర్ టీచర్స్‌లో కలవరం మరింత ఎక్కువైంది. విద్యాహక్కు చట్టం 2010 ప్రకారం ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. అందువల్ల 2010 నుంచి ఉపాధ్యాయ పోస్టులు పొందిన వారంతా టెట్ ఉత్తీర్ణత సాధించినవారే. అయితే 2010వ సంవత్సరంకంటే ముందు కేవలం డీఎస్సీలో మాత్రమే ప్రతిభ చూపి ఉపాధ్యాయ పోస్టులు పొందారు. 2010 కంటే ముందు ఉపాధ్యాయ పోస్టులు సాధించిన వారు జిల్లాలో వేల సంఖ్యలోనే ఉన్నారు.ఇదిలావుంటే ఐదు సంవత్సరాలలోపు పదవీ విరమణ పొందే వారు మినహా మిగతా వారు 2027 ఆగస్టు 31వ తేదీలోపు టెట్ ఉతీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఒకవేళ ఆలోగా టెట్‌లో ఉత్తీర్ణత సాధించకుంటే ఉద్యోగం వదులుకోవాలని తీర్పులో వెల్లడించింది. దీంతో వేలాది మంది ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

» బోధన కుంటుపడే ప్రమాదం

సుప్రీంకోర్టు తీర్పు వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కుంటుపడే ప్రమాదం ఉందని విద్యావంతులు, మేధావులు అంటున్నారు. రెండేళ్లల్లో టెట్ ఉత్తీర్ణత సాధించక పోతే ఉద్యోగం వదులుకోవాల్సి ఉండటంతో ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణతపైనే దృష్టిసారిస్తారు. పాఠశాలలోనే ప్రిపేర్ అయ్యే అవకాశం లేకపోలేదు. అందువల్ల బోధన కుంటుపడే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లక్షల్లో తగ్గింది. అయితే ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణతపైనే దృష్టిసారిస్తే బోధన మరింత కుంటుపడి తద్వారా ప్రభుత్వ పాఠశాలల ఉనికికే ప్రమాదం ఉంటుందని విద్యావంతులు, మేధావులు అంటున్నారు.

- ప్రస్తుతం ఉపాధ్యాయులపై బోధనేతర పనులు ఎక్కువయ్యాయి. కుటుంబ బాధ్యతలు ఉంటాయి. దీంతో టెట్‌కు ప్రిపేర్ అయ్యేందుకు సమయం ఉండదని టీచర్లు ఆందోళన చెందుతున్నారు.

పునరాలోచించాలి



2010 కంటే ముందు ఉపాధ్యాయ పోస్టు పొందిన వారు టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఇచ్చిన తీర్పుపై పునరాలోచించాలి.రెండు, మూడు దశాబ్దాలుగా పనిచేసే ఉపాధ్యాయులు వృత్తిపరంగా ఎప్పటికప్పుడు అనేక శిక్షణలు పొందుతున్నారు. అందులో భాగంగా ఇన్‌సర్వీస్, రెసిడెన్షియల్, ఆన్‌లైన్ వంటి శిక్షణలు పొందారు. అందువల్ల టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న నిబంధన సరి కాదు.

–వై.సుబ్రమణ్యంరాజు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

మానవీయ కోణంలో పరిశీలించాలి



టెట్ ఉత్తీర్ణ సాధించాలన్న తీర్పును అత్యున్నత న్యాయస్థానం మానవీయ కోణంలో పరిశీలించాలి. ఎందుకంటే చాలా మంది ఉపాధ్యాయులకు కుటుంబానికి సంబంధించిన బాధ్యతలు కూడా ఎక్కువగా ఉన్నాయి. కొందరు తమ తల్లిదండ్రుల ఆరోగ్యం వంటి వాటిని చూసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అందువల్ల టెట్‌కు ప్రిపేర్ అయ్యేందుకు సమయం ఉండదు. వీటిని సుప్రీం కోర్టు పరిగణలోకి తీసుకోవాలి.

–హేమ, పీఎస్‌హెచ్, భువనగిరిపల్లె, రాజంపేట మండలం

రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. త్వరలోనే టెట్ పరీక్ష నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందువల్ల ప్రభుత్వం ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా జీఓ జారీ చేయాలి. –బిక్కా హరిప్రసాద్, యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

గుప్త నిధుల కోసం త్రవ్వకాలు


నిధుల కోసం పూజలు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని హంద్రీనీవా కాలువ దిగవ భాగాన గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి గుప్త నిధుల కోసం త్రవ్వకాలు చేపట్టారు. నిధి అన్వేషణలో భాగంగా దుండగులు ముందుగా పూజలు చేసి బలమైన రాతి బండలను పక్కకు తొలగించారు. అనంత రం నిధి నిక్షేపాలు ఉన్నాయని భావించిన స్థలంలో గడ్డపారతో లోతుగా త్రవ్వారు. ఇటీవల ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో ఇలా త్రవ్వకాలు చేపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆగిన లారీని ఢీకొన్న బస్సు


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు


గాయపడిన కండక్టర్ యంగముని

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట వద్ద ఆగిన లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో కండక్టర్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు పులివెందుల నుంచి ఆర్టీసీ బస్సు తిరుపతికి బయలుదేరింది. ఒంటిమిట్ట వీరాంజనేయస్వామి గుడి వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బస్సు డ్రైవర్ రమణారెడ్డి ఆగిన లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కండక్టర్ యంగమునికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నందలూరు నుంచి 108 వాహనం రప్పించి యంగమునిని కడప రిమ్స్‌కు తరలించారు. సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో 80మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు సమాచారం.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఇద్దరికి గాయాలు


గాయపడిన శివయ్య

తంబళ్లపల్లె : ద్విచక్ర వాహనం(బైక్) అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... పెద్దమండ్యం మండలం మందలవారిపల్లెకు చెందిన దివాకర్‌రెడ్డి(32), శివయ్య(50) సొంత పనిమీద తంబళ్లపల్లెకు వచ్చారు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో బోయపల్లి వద్ద వాహనం అదుపు తప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. శివయ్యకు తలకు గాయం కావడంతో 108 వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

సర్కారు నిర్లక్ష్యం..
కూలుతున్న వృక్షం

అక్రమార్కులు భారీగా వృక్షాలను కూల్చేసి గుట్టుచప్పుడు కాకుండా తమిళనాడు, మహా రాష్ట్రాలకు అక్రమంగా తలించుకుపోతున్నారు. టీడీపీ నేతల అండ పుష్కలంగా ఉండడంతో ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. ఓ వైపు ప్రభుత్వం మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రచారం చేస్తున్నా.. మరోవైపు అక్రమార్కులు మొక్కలే లేకుండా చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు.

- తమిళనాడు, మహారాష్ట్రాలకు తరలిపోతున్న కలప
- టీడీపీ నేతల అండతో నేలకొరుగుతున్న చెట్లు


గుర్రంకొండ సమీపంలో నరికి తరలించేందుకు సిద్ధం చేసిన కలప


ఎగువ హరిజనవాడలో కూల్చివేసిన వందేళ్ల చెట్టు

గుర్రంకొండ : ఎక్కడపడితే అక్కడ యథేచ్ఛగా చెట్లు నరికివేస్తున్నారు. చెట్ల సంరక్షణ చూసే అటవీ, రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గ్రామాల్లో అన్ని రకాల చెట్లు, వనాలు పురాతనమైనవి. శతాబ్దాల క్రితం నాటిన చెట్లపై వ్యాపారులు దృష్టిసారిస్తున్నారు. పట్టాలున్న పొలాల్లో గాక పోరంబోకు స్థలాల్లోని మొక్కలను అక్రమంగా నరికివేస్తున్నారు. ఇంటి వస్తువులు తయారుచేసే కలపతో పాటు ఇటుక బట్టీలు కాల్చడంలోనూ వినియోగించుకొంటున్నారు. చివరకు దేవుడి మాన్యం, వంక పోరంబోకు, చెరువుపోరంబోకు స్థలాల్లోని పురాతన చెట్లను వదలడం లేదు. లక్షలాది రుపాయల విలువ చేసే చెట్లను నరికి సొమ్ము చేసుకొంటున్నారు.

తరలిపోతున్న వృక్షసంపద

జిల్లాలోని వ్యాపారులే కాకుండా తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి చింతచెట్లతోపాటు సంద్ర, కంప ఇతర వృక్ష సంపదను కొల్లగొడుతున్నారు. బయట రాష్ట్రాల నుంచి కూలీలను జిల్లాకు తలరించి రేయింబవళ్లు చెట్లు నరికి బయట రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. ఇందులో వందల ఏళ్ల గల చెట్లు ఉన్నాయి. తోటలు, పొలాల గట్లు, ఊరి మధ్యలో, రచ్చబండల మధ్య ఉన్న చెట్లను నరికి వేయడంతా బోసిపోయి కనిపిస్తున్నాయి. ఒక్కో చెట్టు నుంచి చవ్చే కలప సుమారు రూ.20 వేల నుంచి రూ. 40వేల వరకు ధర పలుకుతోందని అంచనా. ఇంటి వస్తువుల తయారీకి ఉపయోగపడే చెట్లు లక్షలాది రుపాయలు ధర పలుకుతున్నాయి. స్థానిక వ్యాపారులు ఇతర రాష్ట్రాల వారితో కుమ్మక్కై ఇష్టానుసారం తరలించేస్తున్నారు.

అక్రమార్కులకు టీడీపీనేతల అండ

బయట రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఇష్టానుసారంగా చెట్లను నరికి వేస్తున్న అక్రమార్కులకు కొంత మంది టీడీపీ నేతలు అండగా నిలుస్తున్నారు. ఇటీవల చెర్లోపల్లె, కృష్ణాపురం, ప్రస్తుతం గుర్రంకొండ పట్టణ సమీపంలో భారీగా వృక్ష సంపదను నరికి డంపింగ్ చేశారు. రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తమిళనాడు, మహారాష్ట్ర తరలించడం.. తనిఖీ చేసిన అధికారులకు టీడీపీ నేతలనుంచి ఫోన్లు రావడంతో వెనుదిరిగి వచ్చేసున్నారు. ఇటీవల కృష్ణాపురం దగ్గర తమిళనాడు రాష్ట్రానికి చెందిన అక్రమార్కులు భారీగా చెట్లను నరికి లారీల్లో లోడింగ్ చేశారు. సమాచారం అందుకొన్న రెవెన్యూ అధికారులు హుటాహుటిన వెళ్లి చర్యలకు ఉపక్రమించగా టీడీపీ నేతల ఫోన్లు రావడంతో చేసేదిలేక వెనుదిరిగి వచ్చేశారు. ఇలా పలు ప్రాంతాల్లో టీడీపీ నేతల అండతో కొందరు ఇష్టానుసారంగా వృక్షసంపద కొల్లగొడుతున్నారు.

మాకు కాదు.. మీకే సంబంధం

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మాది కాదు.... మీదంటూ అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ఒకరిపై ఒకరి నిందలు వేసుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు. చెట్లను నరికి వేయడానికి ముందుగా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత నరికివేసిన చెట్లను ఏ ప్రాంతానికైనా తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. చెట్లను కోసేయడానికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లారీలు, ట్రాక్టర్ల ద్వారా వృక్ష సంపద తరలించారు. కొయ్య మిల్లులతోపాటు బయట రాష్ట్రాలకు తీసుకుతున్నా చోద్యం చూస్తూ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కలప తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



చెట్లను అక్రమంగా నరికివేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా ఎవరైనా వ్యాపారులు చెట్లను నరికివేసి తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. చెట్లు నరికివేతపై ప్రజలు తమకు సమాచారం అందించి సహకరించాలి.

– సదాశివప్పనాయుడు, ఎంఆర్ఐ, గుర్రంకొండ

తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి

రెవెన్యూ అధికారులు చెట్లను నరికి వేయడానికి అనుమతిచ్చినా.. అటవీ శాఖ అనుమతి లేనిదే బయట ప్రాంతాలకు తరలించరాదు. ప్రతి వాహనం నరికి కలప ఎక్కడికి, ఎందుకు తీసుకు వెళుతున్నారనే సమాచారం ఇవ్వాలి. మా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తాం.

– రామ్మోహన్, ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్, గుర్రంకొండ

ఇద్దరిపై కేసు నమోదు

కేవీపల్లె : మైనర్ బాలిక ప్రసవించిన ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని బసన్నగారిపల్లెకు చెందిన మైనర్ బాలిక(16) తండ్రి అనారోగ్యంతో ఉన్నాడు. తల్లి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన వరుసకు అన్న అయిన నాగేంద్ర అలియాస్ నాని ఒంటరిగా ఉన్న మైనర్ బాలికను లోబరచుకుని లైంగిక దాడికి పాల్పడాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. ఈ నెల 7న పురిటి నొప్పులు రావడంతో పీలేరులోని మాధవి అస్పత్రికి తరలించారు. 8న బాలికకు కాన్పు చేయడంతో మగ బిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం బిడ్డను స్వాధీనం చేసుకుని రాయచోటి శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి తరలించారు. ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ ఫిర్యాదు మేరకు లైంగిక దాడికి పాల్పడిన నాగేంద్రపైనా, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా కాన్పు చేసిన డాక్టర్ మాధవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృత చెందిన టి.క్రిష్టారెడ్డి

సంబేపల్లె : మండలంలోని దేవపట్ల కస్పాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిక్కం క్రిష్టారెడ్డి (65) మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. కట్టుగుత్తపల్లెకు చెందిన క్రిష్టారెడ్డి స్కూటర్‌లో సొంత పనుల నిమిత్తం దేవపట్లకు వెళ్లి తిరిగి వస్తున్నారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆవులవాండ్లపల్లె క్రాస్ వద్ద కలకడ వైపు నుంచి ద్విచక్ర వాహనం వస్తోంది. ఇరు వాహనాలు ఢీకొనడంతో క్రిష్టారెడ్డికి గాయాలయ్యాయి. తిరుపతి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి యజమాని చనిపోవడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిగువగొట్టివీడులో చోరీ

చిన్నమండెం : చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామంలో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దిగువగొట్టివీడుకు చెందిన వేణుగోపాల్ నాయుడు పొలం పనులకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు శనివారం మధ్యాహ్నం ఇంట్లో చొరబడి చోరీ చేశారు. విషయం తెలుసుకుని బాధితుడు వేణుగోపాల్‌నాయుడు హుటాహుటిన ఇంటికి చేరుకుని పరిశీలించారు. రూ.50 వేల నగదు, తులం బంగారు చోరీకి గురైందని గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు


గాయపడిన నాగేశ్వరనాయక్

సుండుపల్లె : మండలంలోని మిట్టబిడికి కాలనీలో శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్లితే.. నాగేశ్వర నాయక్ గొర్రెలు మేపుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన ఇసుక ట్రాక్టర్ అతన్ని ఢీకొంది. నాగేశ్వరనాయక్ తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు.

డాబా హోటల్‌పైకి దూసుకెళ్లిన బొలెరో


బొలెరో ఢీకొన్ని, దెబ్బతిన్న డాబా హోటల్

గుర్రంకొండ : డాబా హోటల్‌పైకి వేగంగా వెళుతున్న ఓ బొలెరో వాహనం దూసుకెళ్లిన సంఘటన మండలంలోని గుర్రంకొండలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక మార్కెట్ యార్డు సర్కిల్లో పెద్ద ఎత్తున డాబాహోటళ్లు నిర్వహించుకొంటూ పలువురు జీవనం సాగిస్తున్నారు. గత శుక్రవారం రాత్రి మదనపల్లె నుంచి బయలుదేరిన ఓ బొలెరో వాహనం వేగం డ్రైవర్ అదుపు చేయలేక ఓ డాబా హోటల్‌పైకి దూసుకెళ్లాడు. డాబా పక్కనే ఉన్న పెద్దమండ్యం మండలానికి చెందిన మరో బొలెరో వాహనం, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో నిలబడిపోయింది. రాత్రి వేళ డాబా మూసి ఉండడతో పెద్ద ప్రాణాపాయం తప్పింది. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గాలివీడులో కుండపోత వర్షం


గుంతలమయైన రోడ్డులో వస్తున్న పాదచారులు


వెలిగల్లు జలాశయానికి జలకళ

గాలివీడు : వరుణుడు ఉగ్రరూపం దాల్చడంతో గాలివీడు మండలంలో శుక్రవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. 108.4 మిల్లీ మీటర్లుగా నమోదైందని ఏఎస్ఓ శ్రీదుర్గ తెలిపారు. ఈ వర్షానికి చెరువులు, వాగులు, వంకలు పొంగి పార్లి ప్రవహించాయి. వెలిగల్లు జలాశయానికి వదర ప్రవాహం పెరగడంతో 3.027 నీటిమట్టం టీఎంసీలకు చేరుకుందని డీఈ శిరీష్‌కుమార్ తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.11 టీఎంసీలకు చేరింది. మండలంలోని గోరాన్ చెరువు నుండి వడిశలంకపల్లి వరకూ వరద నీరు పెరగడంతో పెద్ద చెరువుకు నీరు చేరింది. ఎల్లంపల్లి కుషావతి రిజర్వాయర్ నుంచి నడింపల్లి మీదుగా వచ్చే ప్రవాహంతో చిన్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

రాకపోకలకు అంతరాయం

తంబళ్లపల్లె: వర్షాలకు మండలంలోని ములకలచెరువు రోడ్డు నుంచి గోపిదిన్నెకు వెళ్లే రోడ్డు చిన్నేరు మొరవనీటితో కొట్టుకుపోయింది. కోతకు గురికావడంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. వేపలపల్లె, అనగలవారిపల్లె, దిగువపల్లె, దిన్నెమీదపల్లె, మెరుసుపల్లి బురుజు ,కె.బి.తాండా, రాగిమానుదిన్నె నుంచి ప్రజలు నిత్యం తంబళ్లపల్లెకు ఈ రోడ్డు మార్గంలోనే రావాల్సి వుంది. గతంలో ఇక్కడ ద్విచక్ర వాహనం బోల్తాపడి చిన్నారి నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన చేసుకుంది. ప్రస్తుతం రోడ్డు కోతకు గురికావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు


రచ్చబండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మెడికల్ కాలేజీల ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ నిర్వహించి చంద్రబాబు తప్పిదాలను శనివారం ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ పేదలకు వైద్యం అందాలనే ఉన్నత లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని దోపిడీదారులకు తాకట్టు పెడుతున్నాడని ఆరోపించారు. పేద ప్రజలకు చంద్రబాబు చేసిందేమీ లేదని, అప్పులు తెచ్చి కార్పొరేట్లకు దోచిపెట్టే కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. ముందుచూపుతో పేదల కోసం జగనన్న చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ధ్వంసం చేసే కార్యక్రమాలను మాత్రమే చేపడుతున్నారని ఆరోపించారు. రాజకీయ కక్షలను ప్రేరేపిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తున్నారని, అక్రమాలు, దౌర్జన్యాలు, అంటూ కేసులు పెడుతూ కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. బాబు మోసపు పాలనను ప్రజలు గుర్తించి చైతన్య వంతులవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దాబాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డిధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్.రమేష్, సుబ్బరామరాజు, చంద్రశేఖర్, మందలనాగేంద్ర, శివయ్య, సిద్ధయ్య, మహేష్ రెడ్డి, నారాయణమ్మ, రమేష్, కృష్ణారెడ్డి, నందాబాల, ఆనంద్, రాజారెడ్డి, సుకుమార్, పవన్, గౌసియా, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. పురిటి బిడ్డ మృతి

టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



ఆస్పత్రికి వచ్చిన కవిత, మృతి చెందిన పురిటిబిడ్డ

మదనపల్లె రూరల్ : గర్భం దాల్చి ప్రసవానికి వస్తే.. వైద్య సిబ్బంది తోచిన విధంగా కాన్పు చేయడంతో పురిటి బిడ్డ మృతి చెందిన ఘటన మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జరిగింది. బాధితుల వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె కుమ్మరవీధికి చెందిన మేస్త్రీ ప్రసాద్ తన భార్య కవిత(35)కు పురిటినొప్పులు రావడంతో ప్రైవేట్ వాహనంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. డ్యూటీ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో నర్సింగ్ సిబ్బంది కవితను పరీక్షించి అడ్మిట్ చేసుకున్నారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఉదయం ఐదు గంటల సమయంలో నొప్పులు అధికమవడంతో కవితను కాన్పు గదికి తీసుకెళ్లారు.

పది గంటల వరకు సిబ్బంది చికిత్స చేసి ఆడబిడ్డను బయటకు తీశారు. పుట్టిన బిడ్డలో చలనం లేక పోవడంతో వైద్యులకు సమాచారం అందించారు. అప్పుడు వచ్చిన వైద్యుడు బిడ్డను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఏళ్ల తర్వాత గర్భం దాల్చడం, బిడ్డ 3.6 కిలోల బరువు ఉండడంతో మృతి చెందిందని పేర్కొన్నారు. హైరిస్క్ గర్భవతి అడ్మిషన్‌లో ఉన్నా వైద్యులు ఒకసారీ పరీక్షించలేదని, వారు అందుబాటులో ఉండి చికిత్స అందించి ఉంటే బిడ్డ దక్కేదని కుటుంబ సభ్యులు విలపించారు. డ్యూటీ డాక్టర్లు విధుల్లో లేకపోవడం వల్లే తమ బిడ్డ మరణించిందని, వైద్యుల నిర్లక్ష్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయంచేయాలని బాధితులు కోరారు.

విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

పురిటి బిడ్డ మృతి, వైద్యుల నిర్లక్ష్యంపై బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికి వచ్చినపుడు తల్లి గర్భంలోని బిడ్డ పరిస్థితి బాగా ఉండడంతో నార్మల్ డెలివరీ అవుతుందని భావించి వైద్య సిబ్బంది ప్రయత్నించారు. బిడ్డ అధిక బరువు ఉండడం, ఉమ్మునీరు తాగడం, చాలా ఏళ్ల తర్వాత రెండో కాన్పు రావడ వంటి కారణాలతో బిడ్డ మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. విచారించి చర్యలు తీసుకుంటాం.

– షకూర్, ఆర్ఎంఓ, జిల్లా ఆస్పత్రి, మదనపల్లి

నకిలీ మద్యం కేసు సీబీఐకి అప్పగించాలి

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి అర్బన్ : నకిలీ మద్యం కేసు సీబీఐకి అప్పగించాలని, కూటమి నేతల కల్తీ లిక్కర్ కుటీర పరిశ్రమలపై నిజాలు నిగ్గుతేల్చాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటిలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యంతో జగన్ ప్రభుత్వం హయాంలో ఏదో జరిగిపోయిందని ఆరోపించిన చంద్రబాబు చివరకు నిరూపణ చేయలేకపోయారన్నారు. ఆధారాలు లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డి, సీనియర్ అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను అక్రమంగా నిర్బంధించారన్నారు. కూటమి నాయకులు మాత్రం కల్తీ మద్యం తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రాణాంతకమైన స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు సి మహిళ పసుపుకుంకాలతో ఆటలాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు రూ.40 నుంచి రూ.50 కోట్ల ప్రజాధనం కొల్లగొడుతున్నారన్నారు. కల్తీ మద్యం తయారీలో చంద్రబాబు, లోకేష్, ఇతర నాయకుల పాత్రపై సీబీఐచే విచారణ చేయించి నిజాలు నిగ్గుతేల్చాలన్నారు. 16 నెలల పాలనలో వైఎస్.జగన్ ప్రజలకు చేసిన మేలు, తెచ్చిన అప్పులపై కూడా చర్చించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు పూనుకున్న కూటమి సర్కార్‌పై కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామని, ప్రైవేటీకరణ ఆపేంత వరకూ పోరాటం ఆపేదిలేదన్నారు.

ఈవ్ టీజింగ్ వద్దన్నందుకు కండక్టర్, డ్రైవర్‌పై దాడి

మదనపల్లె రూరల్: అతిగా మద్యం తాగి ఆర్టీసీ బస్సులో అమ్మాయిలను ఈవ్‌టీజింగ్ చేస్తున్న యువకులను అడ్డుకున్నందుకు ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కండక్టర్, డ్రైవర్ తెలిపిన వివరాలు... మదనపలె డిపోకు చెందిన కండక్టర్ శ్రీరాములు, డ్రైవర మురగయ్య మదనపల్లె-మొటుకుపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసు విధులకుహాజరయ్యారు. శనివారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు సమీపంలోని మొటుకుపల్లె నుంచి బస్సు మదనపల్లెకు బయలుదేరింది. మండలంలోని గెలిజగూరు సమీపంలో భరత్, రాజేష్, భానుప్రకాష్, మరికొందరు స్నేహితులతో కలిసి అతిగా మద్యం తాగి బస్సు ఎక్కారు. కేకలు వేస్తూ బస్సులోని యువతులను ఈవ్‌టీజింగ్ చేయసాగారు. కండక్టర్ శ్రీరాములు వారి వద్దకు వెళ్లి అమ్మాయిలతో ఇలా ప్రవర్తించడం సరికాదని హెచ్చరించారు. మద్యం మత్తులో ఉన్న యువకులు కండక్టర్‌ను అసభ్యపదజాలంతో దూషించి దాడికి పాల్పడ్డారు. ప్రయాణికులు ఎంత వారించినా వినకపోవడంతో బస్సుపోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని డైరవర్ మురుగయ్యకు కండెక్టర్ చెప్పారు. బస్సు పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్తావా? అంటూ డ్రైవర్ మురగయ్యపైనా యువకులు దాడి చేశారు. దాడిలో కండక్టర్, డ్రైవర్లు గాయపడ్డాడు. అల్లరి చేస్తున్న ఆకతాయిలను ప్రయాణికులంతా పట్టుకుని బస్సును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాడి ఘటనపై పోలీసులకు ప్రయాణికులతో కలిసి కండక్టర్, డ్రైవర్ ఫిర్యాదు చేశారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి తిరిగి వెళ్లిపోయారు.

ప్రొఫెసర్ ఇంట్లో దోపిడీ డ్రైవర్ పనే

- 7 మంది ముఠా అరెస్టు
- రూ.1.27 కోట్లు, కొంత బంగారం స్వాధీనం

బెంగళూరు (బనశంకరి) : ఎంతో నమ్మకంగా ఉన్న కారు డ్రైవరే దోపిడీదారుగా మారాడు, తన స్నేహితులతో కలిసి ఓ ప్రైవేటు కాలేజీ ప్రొఫెసర్ ఇంట్లో రూ.1.50 కోట్ల నగదు, 50 గ్రాముల బంగారు ఆభరణాలు దోచేసిన 7 మందిని యలహంక పోలీసులు అరెస్టుచేశారు. వీరి వద్ద నుంచి రూ.1.27 కోట్ల నగదు, రెండు కార్లు, బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ తెలిపారు. శనివారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు.

తంబళ్లపల్లెతో లింకులు

నిందితులు ఆర్ఎంవీ రెండోస్టేజ్ రాజేంద్ర మునోట్ అలియాస్ రాజేంద్ర జైన్, విజయనగర చోళరపాళ్య శ్రీనివాస్, శ్రీనగర కిరణ్‌కుమార్ జైన్, శ్రీరాంపుర హేమంత్‌కుమార్ జైన్, దుమ్మలూరు బీడీఏ లేఔట్ వాసి శంకరప్ప, రామమూర్తినగరవాసి శంకరప్ప, హైదరాబాద్ రామనగర్‌వాసి మోహన్‌గౌడ అలియాస్ జనార్దన్. ఇందులో దుమ్మలూరు శంకరప్ప ప్రొఫెసర్‌కు కారు డ్రైవర్, అతని ఇంట్లో భారీగా డబ్బు ఉందని గమనించాడు. దీంతో మిగతా నిందితులతో కలిసి కుట్ర చేశాడు. గత నెల 19న యలహంక వినాయకనగరలోని ప్రొఫెసర్ ఇంట్లోకి చొరబడ్డారు. తాము ప్రభుత్వ అధికారులమని, మీ ఇంటిని తనిఖీ చేయాలని అతని భార్య, తల్లిని బెదిరించారు. పైన పేర్కొన్న మేరకు నగదు, బంగారాన్ని తీసుకుని కారులో ఉడాయించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి గత నెల 23 తేదీన సంజయ్‌నగరలో ఓ వ్యక్తిని అరెస్ట్‌చేశారు. రెండో వ్యక్తిని ఆంధ్రప్రదేశ్‌లోని తంబళ్లపల్లె వద్ద రేణుమాకలపల్లి గ్రామంలో, బెంగళూరు విజయనగర చోళరపాళ్యలో మిగతా ఐదుమందిని పట్టుకున్నారు. ఇతని మిత్రుడు జనార్దన్ రూ.55 లక్షలు హైదరాబాద్‌లో, రేణుమాకలపల్లిలోని ఓ ఇంట్లో 25.80 లక్షలను దాచి ఉంచాడు. నిందితుల ఇళ్లలో గాలించి రూ.1.27 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఈతకు వెళ్లి వ్యవసాయ విద్యార్థి మృతి


జనార్ధన్ నాయక్ (ఫైల్)

మహానంది : ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం బలిగొంది. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి పాలేరు వాగులో నీట మునిగి మృతి చెందాడు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె మండలం జిల్లెలమండ సమీపంలోని పెద్దతాండకు చెందిన బి.జనార్ధన్‌నాయక్ (21) మహానంది సమీపంలోని వ్యవసాయ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో శనివారం కళాశాల సమీపంలోని పాలేరువాగు వద్దకు తోటి విద్యార్థులతో కలిసి వెళ్లాడు. అక్కడ కొంత మంది దుస్తులను శుభ్రం చేసుకోవడంతో పాటు ఈతకు దిగారు. ఈ క్రమంలో ఐదారుగురు ఈతకు దిగగా సరిగా ఈత రాని జనార్ధన్ నాయక్ వాగులోకి దిగాడు. కొద్ది సేపటికి పక్కనే ఉన్న అతను కనిపించకపోవడంతో మిగిలిన విద్యార్థులు అన్వేషించగా అక్కడే లోతు ఉన్న గుంతలో అపస్మారక స్థితిలో కనిపించాడు. బయటికి తీసి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, పోలీసులు, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.